మాహనుమంతరావ్



# సశేషం

'దాస్... చూడు... ఆకాశంలో ఆ నీలి రంగు మేఘాలు చూడు. ఎంత అందంగా వున్నాయి. మానవులకి ఎన్ని ఆశలు కల్పిస్తున్నాయి చూడు దాస్... చూడు ఎలా వల్లగా మారిపోతున్నాయో... అవి కురియని మేఘాలురా... కురియని మేఘాలు... అలాగే కొందరి జీవితాలు—' సిగరెట్ వెలిగించాడు దాసు.

నీలిరంగు కవరు అమర్చిన కేన్ కుర్చీలో యిబ్బందిగా కదిలాడు సత్యమూర్తి.

'కొంతమంది జీవితాలు ఎటువంటి ఆశలు, ఆశయాలు లేకుండానే సశేషంగానే వెళ్లిపోతాయి; ఆ కోవకు చెందిన వాళ్లమే మనం—' దాసు మొహంలో రంగులు మారాయి'

నీలిరంగు కార్పెట్ వంక చూస్తూ మౌనంగా వింటున్నాడు సత్యమూర్తి.

'నువ్వు జీవితం గురించి ఎప్పుడు ఆలోచించకు. దానిదారిన దాన్ని పోనియ్' నిర్లక్ష్యంగా సిగరెట్ ఆష్ ట్రేలో పడేశాడు.

నీలిరంగు కిటికీ కర్టెన్స్ గాలికి రెపరెపలాడినాయి.

నీలిరంగు చీరె కట్టుకున్న ఒక ముసలి స్త్రీ వచ్చి రెండు బ్రాంది సీసాలు, రెండు సోడాలు, గ్లాసులు టేబిల్ మీద అమర్చి వెళ్లిపోయింది. సత్యమూర్తి భయంతో లేచి నుంచున్నాడు:

'భయపడకు భయ్... భయపడితే బాధలు పారిపోవు... కొంతమంది బాధలతో పుడతారు. బాధలతోనే పెరుగుతారు. బాధతోనే చనిపోతారు. నువ్వు నేను అంతే—ఈ తాత్కాలిక బాధకి మనం లొంగిపోకూడదు' టేక్ యిట్ ఈజీ—, అతని ధోరణికి అడ్డువస్తూ అన్నాడు సత్యమూర్తి 'అది కాదురా.'

'ఏది కాదు' సూటిగా సత్యమూర్తి కళ్లల్లోకి చూశాడు దాసు. సత్యమూర్తి తల వొంచాడు. అతని భుజం తడుతూ 'మిస్టర్ సత్యమూర్తి మై డియర్... బాధల్ని మనం జీవితాంతం భరించవలసినదే ...ఈ బాధలు ఇప్పటితో తీరేవికావు. తల్లికి మందులు... భార్యకి నగలు, చీరెలు, పెళ్లి కావలసిన చెల్లెళ్లు, చదువుకోవలసిన

తమ్ముళ్ళు ... అధిక ధరలతో చాలీచాలని జీతంతో కుటుంబభారం ... ఇవేగా నీ సమస్యలు...ఫ్రాగ్ ఫెలో. డియర్ ఎల్‌డిసీ... వాట్ ఈజ్ లైఫ్... నీ జీవితం ఏమిటి? గమ్యం ఏది? డిపార్టుమెంట్ పరీక్షలు... ప్రమోషన్స్ ... ఎత్తులు పై ఎత్తులు: సబ్‌మిటెడ్ నోట్సులు ... అప్లికేషన్స్... టర్న్ ది పేజి టెన్ ది వర్క్...డెస్క్ రొటీన్‌వర్క్ ... ఛా...ఛా... మార్పులేని యాంత్రిక జీవితం... ఈ జీవితం కోసమా ఇంత శ్రమ పడుతున్నావు...పిచ్చివాడా...' అంటూ టేబిల్ దగ్గరికి వెళ్ళాడు.

'నా మనసేమి బాగుండలేదు ... నేను వెళ్తాను'

'నో...నో.. నువ్వు వెళ్ళడానికి వీలు లేదు. నా కెందుకో భయంగా వుంది. నవీన తాత్కాలిక ఆర్థిక, మానసిక బాధల్ని నెమరువేసుకుంటూ చనిపోయే ప్రమాదం వుంది. నో...నో...వెళ్ళడానికి వీలులేదు కనుక...ఒక పెగ్ తీసుకో...అన్ని మర్చిపోతావు...క్రొత్త బలం వస్తుంది. క్రొత్త జీవితంలో ప్రవేశిస్తావు' అంటూ దాసు రెండు గ్లాసులు నింపాడు.

'వొద్దు...వొద్దు...' అంటూ పిడికిలి బిగించి గది గుమ్మందగ్గర ఆగిపోయాడు, అతని జేబులోని ఉత్తరం గుండెల్లో గుచ్చు కుంది. 'నేను ఏడుగంటలకల్లా మీయింటికి వొస్తాను. నువ్వు తప్పక యింటిదగ్గరే వుండాలి ...ఎక్కడికి పారిపోయినా పట్టుకుంటాను ... నీతో చాలా మాట్లాడాలి. వుంటావుకదూ— 'నీ శ్యామల.' అతని కాళ్ళు ముందుకు సాగలేదు: 'త్వరగా రండి...మీ అమ్మగారికి మందుతో లబ్బిగాడికి పాల డబ్బా కూడా పట్టుకురండి'

సువర్చల కంఠం అతనికి సన్నగా వినబడింది.

సత్యమూర్తికి శరీరమంతా చెమటలు పట్టాయి.

'బ్రదర్ సత్యమూర్తి...ఒకే ఒక పెగ్గు వేసుకో జీవితంలో. కొన్ని నిమిషాలైనా సుఖంగా గడుపు. రోజూ పడేబాధలకి హుషారుగా నిషాగా కొద్ది సెకనులు నాతో వుండు: కమాన్' అంటూ బలవంతంగా సత్యమూర్తి చేతిలో గ్లాసు వుంచాడు దాసు. వణికే చేతులతో అందుకున్నాడు సత్యమూర్తి.

'ఫర్ ది గుడ్ హెల్త్ ఆఫ్ మిస్టర్ సత్యమూర్తి' అంటూ గ్లాసుకి గ్లాసు తగిలించి సిప్ చేశాడు దాసు:

భయపడుతూనే ఒకే ఒక గుక్క వేశాడు సత్యమూర్తి. గొంతు మండిపోయింది కాని అదేమిటోగాని శరీరం అంతా తేలికై పట్టయింది. ఏదో తెలీని విచిత్రానుభవం కలిగింది.

'కమాన్, పకోడీలు తీసుకో' అన్నాడు దాసు.

రెండు పకోడీలు తిని గ్లాసులో బ్రాంది అంతా త్రాగేశాడు సత్యమూర్తి.

'ఎక్కడున్నావ్ గురూ. ఎక్కడున్నావ్' అన్నాడు దాసు.

* * *

'ఎక్కడున్నాడో పిచ్చినాగన్న ... మందు తెస్తానని ఆరుగంటలకి బయటికి వెళ్ళాడు. ఎక్కడున్నాడో' అని మూగవేదనను అనుభవిస్తూ జానకమ్మగారు బలహీనంగా మంచం మీద కదిలారు. ఆమెకు శారీరక బాధ కన్నా మానసికబాధ అధికమయింది. అందుకే మందులు వంట పట్టడంలేదు. గత జీవితాన్ని గురించి సింహావలోకనం చేసుకుంటూ ఏ వొక్క మధుర సంఘటన ఆమె జీవితంలో గోచరించక మథనపడుతున్నది. ఆమె, మౌనంగా గొణుక్కుంది, 'హే భగవాన్ ప్రతి మానవుడి జీవితంలో కనీసం ఒక మధురానుభవం ప్రసాదించు. లేకపోతే... ఆ జీవి మరచించలేడు...మరణించలేడు.'

ఆమె కళ్ళు మూతలు పడటంలేదు; ఆమె కుటుంబం అంతా కళ్ళముందు మెదిలింది.

పెద్ద కొడుకు ఢిల్లీలో సెంట్రల్ గవర్నమెంట్‌లో యు. డి. సి గా వెలుగుతున్నాడు. ఆర్థికంగా కుటుంబాన్ని ఆదుకోక, ఆస్తిలో వాటాకోసం తరుచు ఉత్తరాలు రాస్తూవుంటాడు. అడిగినంత కానుకలు, కట్నాలు యివ్వలేదని అల్లుని కోపానికి ఆహుతి అవుతున్నది అమాయిక అయిన పెద్ద కూతురు. రెండో కూతురు సుమతి; ఎదురింటి రామిరెడ్డితో పరారై పోయింది. ఇంతవరకు పత్తాలేదు. రెండో కొడుకు సత్యమూర్తి ముగ్గురు పిల్లల తండ్రి, చాలీచాలని జీతంతో కుటుంబాన్ని నడుపుకున్నాడు. పెరిగిన యిద్దరు కూతుళ్ళు పెంచవలసిన యిద్దరు కొడుకులు; ఎనిమిది మంది పిల్లల తండ్రి ఆ యింటాయనే నాలుగు పదులు నిండకుండనే గుండె జబ్బుతో నిష్క్రమించాడు. మంచివారికి మరణమే సాక్షి' అంటూ ఆయన కిచ్చిన అప్పుల్ని రెండోకొడుకు కట్నంతో పర్చుకున్నారు పెద్ద మనష్యులు.

జానకమ్మగారు భవిష్యత్ గురించి ఆలోచిస్తున్నది. పెద్దవాళ్ళైన నలుగురి గురించి ఆందోళన పడి లాభంలేదని తెలుసుకుంది. చిన్నవాళ్ళు నల్గురి గురించే ఆవిడ ఆవేదన. వాళ్ళ భవిష్యత్ గురించి ఊహించలేక పోతున్నది. ఆమె మనసు పరిపరివిధాల పోతున్నది: ఆమె గాజుకళ్ళు కనపడని భవితవ్యాన్ని వెతకుతున్నాయి. ఆమె అలా కళ్ళు తెరచుకుని చూస్తూనేవుంది.

* * *

మూతలు పడుతున్న కళ్ళను బలవంతంగా తెరుస్తూ ఆమెవొంక చూస్తున్నాడు సత్యమూర్తి; తెలుపు, నలుపు, కలిపిన రంగులో ఆమె మొహం నీలిరంగు దీపపుకాంతిలో విచిత్రంగా మెరిసిపోతున్నది. ఆమె కళ్ళల్లో కాంతిలేదు, కాంక్ష వుంది. ఆమె చేతిలో గాజుగ్లాసు వుంది. గ్లాసునిండా ఎర్రని ద్రావకం...ఎర్రని చీరెలో ఆమె నల్లని శరీరం, మార్చిమార్చి చూస్తున్నాడు. అవయవాలు పొందికగా లేవు. అలంకరణ ఆడంబరంగా వుంది:

'తీసుకోండి' అంటూ పెదవులకి గ్లాసు అందించింది:

సత్యమూర్తి ఆమెలో ఉన్న ఆకర్షణ గురించి ఆలోచిస్తూ ఆమె కళ్ళల్లోకి చూశాడు. హఠాత్తుగా నరాలు జివ్వుమన్నాయి. ఆమె సత్యమూర్తి ముంగురులు సవరించింది:

'ఏమిటలా చూస్తారు.'

సువర్చల మాటలు గుర్తుకొచ్చినాయి సత్యమూర్తికి.

'మా స్నేహితురాలితో అప్పుడు ఏమన్నానో తెలుసా? మావారు కన్నెత్తి చూస్తే చాలు వాళ్ళు చాలా అదృష్టవంతులు.'

'నా మీద ఎంత పిచ్చినమ్మకం' అనుకుంటూ నిట్టూర్చాడు సత్యమూర్తి.

* * *

'అదృష్టవంతులు...వాళ్ళంతా అదృష్టవంతులు' అనుకుంటూ రిక్షాలో పోతున్న దంపతుల వొంక ఈర్ష్యగా చూసింది

సువర్చల. టైం ఏడుగంటలు అవుతోంది; ఆయన యింకా రాలేదేమిటి? ఎక్కడికి వెళ్లారో ... డాక్టరు మందులు కావాలి అన్నారు. డబ్బులు కావాలి...సంపాదించాలి అంటూ వెళ్లిపోయారు. అప్పు ఎవరు యిస్తారు? అందులో ఈ రోజు అధిక ధరలకి నిరసనగా అఖిల రాజకీయపక్షాల బలంతోపట్టణంలోహర్తాళ్. అన్నీ బంద్... స్వంతం అనుకున్న యిల్లు తనఖాబ్యాంక్‌లో వుంది. తెలిసినవాళ్ల అందరిదగ్గర అప్పులు చేశారు. మెడమీద తలవున్న ఎవరు కూడా ఈ నూటఇరవై బేసిక్ ఉద్యోగికి వడ్డీమీద అప్పు యివ్వరు...తాకట్టు పెట్టడానికి వస్తువులు లేవు...ఏం చూసుకుని ఆయనకి డబ్బు యిస్తారు? నాన్న మాత్రం ఏం చూసుకుని తనకి సంబంధం అంటగట్టాడు. ఇంకొంచం ఎక్కువ కట్నం యిస్తే మంచి సంబంధం కాకపోయిందా? ఆ అసిస్టెంట్ ఇంజనీర్ సంబంధం ఆరువేలతో ప్రారంభమయింది. అయిదువేలకి దిగవచ్చును అన్నారు, పెద్ద మనుష్యులు; నాన్న నాలుగువేలదగ్గర ఆగిపోయారు. అయిదువేలతో కోమలి భర్తగా మారిపోయాడు అసిస్టెంట్ ఇంజనీర్.

ఇప్పుడు వాళ్లిద్దరు చిలకాగోరువంకల్లా ఉన్నారు. తాను ముగ్గురు పిల్లలతో ఇరవై సంవత్సరాల వయసుకే అరవై సంవత్సరాల ముత్తైదులా తయారయింది! కారణం ఆయన! ఎప్పుడూ ఆలోచిస్తూ నిరాశగా నిట్టూరుస్తూ వుంటారు. మధ్యలో ఈ శ్యామల పాత్ర ఒకటి తన జీవితంలో! శ్యామల ఆయన కలిసి పెరిగారని; చదువుకున్నారని తెలుసు. ప్రేమించుకున్నారనికూడా తెలుసుకుంది. ఈ ప్రస్తావన రెండు మూడుసార్లు తెస్తే 'అన్ని ప్రేమలు పెండ్లివరకు వెళ్లవు' అన్నారు నిర్లిప్తంగా. ఆ జవాబుకి అర్థం తనకి బోధపడలేదు.

'ఈ రోజు ఏడుగంటలకి వస్తున్నాను మీ యింటికి' అని ఉత్తరం రాసింది శ్యామల. దానీ అన్నీ అడగాలనుకొని తీర్మానించుకుంది. తన భర్తమీద ఇంకోరి అధికారాలు; ప్రేమలు పనిచేయకూడదు. తనని ప్రేమించాలి, లాలించాలి.

పిచ్చి సువర్చల ఇంకా ఆలోచిస్తూవుంది. కారు హెడ్‌లైట్స్ ఆమెపై పడ్డాయి. గబగబా గదిలోకి వచ్చింది:

'వచ్చినట్టున్నాడు వెధవ పీనుగ' అని మనసులో కసితీరా తిట్టుకుంది: ఆ రోజు సంఘటన మెరపులా ఆమె కళ్లల్లో మెరసింది: ఆ రోజు శ్యామలమీద చాలా జలసీ ఫీల్ అయింది. ఆ రోజు రాత్రి ఎవరు ఎన్ని చెప్పినా వినకుండా కోపంగా మల్లెపందిరిపీడలో అన్నం తినకుండా పడుకుంది. సత్యమూర్తి కాసేపు బ్రతిమాలి తానూ పస్తుపడుకున్నాడు. పదిగంటలు యింకా కాలేదు.

'ప్స్.. ప్స్' అని శబ్దం వినబడింది. తరుచు ఆ శబ్దం తాను వింటూనేవుంది. ప్రక్కింటి ఆఫీసర్‌గారు తరుచు అంటూ వుంటారు.

రెండుమూడుసార్లు కళ్లెత్తి చూసి తల దించేసింది. ఆ రోజు బాదంచెట్టునీడలో నించున్నారు. తాను లేచినించుంది.

'ఏమండీ'

'ఎవరు—' అంది బిగ్గరగా.

'నెమ్మదిగా మాట్లాడండి. మీతో చాలా మాట్లాడాలి...ఇలా కొంచం చీకటిలోకి వస్తారా?' అన్నాడు ప్రాధేయపూర్వకంగా.

పెళ్లాన్ని పుట్టింటికి పంపిన పెద్దమనిషి పరాయిస్త్రీతో మాట్లాడే మాటలు ఊహించుకున్న తాను అక్కడే ఉన్నకర్రతో ఒకేఒక దెబ్బకొట్టి గబగబా లోపలికి వొచ్చి సత్యమూర్తిని కౌగలించుకుంది. 'ఆకలి వేస్తోందా ... పిచ్చిపిల్లా...పద... భోజనం చేద్దాం.' 'నన్ను విడిచి మీరు వెళ్లవద్దు. నన్ను అన్యాయం చేయకండి.' అంటూ లతలా అతనిని పెనవేసుకుపోయింది. ఇంకేం చేస్తుంది పాపం!

* * *

తన నడుంపై వున్న సత్యమూర్తి చేతిని తొలగించి. నెమ్మదిగా జేబులు తడిమి రెండు వందలు తీసుకుంది పిల్ల!

'పిల్లా నన్ను అన్యాయం చేయకు' లేచి నించున్నాడు దాసు.

'తీసుకో' అంటూ కొన్ని కాగితాలు యిస్తూ 'ఈ దొరగారు ఎప్పుడు మేలుకుంటారో—గొడవ చేయకుండా వెళ్తాడు కదా' అందామె అనుమానాస్పదంగా.

'నాలుగుపడవలా ... ఎంత కష్టపడ్డాను. చిలకను గూటికి చేర్చడానికి'

'పడవలు కాకపోతే ప్రాజక్టు కాగితాలు వస్తాయా? ఇంతకి ఎక్కడ పట్టావ్?'

'వీడు నా ఫ్రెండ్...పాపం చాలా ఆర్థిక ఇబ్బందుల్లోవున్నాడు కష్టాలు మర్చిపోడానికి మందు చెప్పన్నాడు. నేను చెప్పను. మందు యిస్తాను, అంటూ తీసుకువొచ్చాను.'

'ముందు చాలాభయపడ్డాడు.'

'ఎందుకు భయం' అందామె చిలిపిగా.

* * *

'ఎందుకురా అలా భయపడుతావ్ ... లోపలికి రారా' అంది సుమతి. తప్పుచేసిన విద్యార్థిలా లోపలికి వొచ్చాడు సత్యమూర్తి. తలుపులు వేసింది. యిద్దరి మధ్యన రెండు నిమిషాలు నిశ్శబ్దం రాజ్యమేలింది. చివరికి సుమతి అంది 'నే నిక్కడ వున్నాని ఎలా తెలిసింది.' నొక్కి నొక్కి ప్రశ్నించింది. 'శ్యామల ఉత్తరం రాసింది' అని ఆమె మొహంలో భావాలు చూడడానికి తల ఎత్తాడు. సుమతి కిటికీలోంచి బయటకు చూస్తు ప్రశ్నించింది.

'ఇన్నాళ్లకు అక్కయ్య గుర్తుకు వచ్చిందన్నమాట.'

'సీ ఆ మాకికోసం ప్రయత్నిస్తూనే వున్నాం. కాని అక్కయ్యా—'

'అవన్నీ ఇప్పుడు ఎందుకు? ఇంట్లో అంత క్షేమం కదా—'

'క్షామం—క్షేమం' మాటలు తడబడినాయి.

'నాన్నగారు చనిపోయినప్పుడు తెలిసింది. వొద్దామనుకున్నాను. కాని రాలేకపోయాను. నా కెందుకో మనసు అంగీకరించలేదు.

మీ రందరు యిప్పుడు మంచి మనుష్యులు. మర్యాదస్థులు. మీ మధ్యకి నేను వచ్చి—'

ఆమె మాట్లాడలేదు. ఆమె కళ్లల్లో నీళ్లు మాత్రం ఉన్నాయి.

'అక్కయ్యా ... అయిపోయిందేదో అయిపోయింది. ఇంటికిరా ... అక్కయ్యా...' ఆర్ద్రమయింది అతని కంఠం.

'ఎందుకు—ఎందుకు— నాకంతా తెలుసు. నువ్వు యిప్పుడు యిక్కడకి ఎందుకు వొచ్చావో తెలుసు. 'నేను అన్ని తెలుసుకుంటూనేవున్నాను'

'అక్కయ్యా—'

'అమ్మ ఇప్పుడు చావుబ్రతుకుల మధ్య వుంది. మందులకి డబ్బులేదు. అప్పులు లభించే అవకాశాలులేవు. అందుకని అక్కయ్య దగ్గరకు వొచ్చావు. ఇల్లు విడిచి అయిదు

క్రొత్త అమూల్ సమర్పణ

# అమూల్‌స్ప్రే

## ప్రోటీనులు అధికంగాగల శిశువాహారం

ఇతర క్షీరాహారమెందులోను శరీర నిర్మాణక ప్రోటీనులు
ఇంతకు మించి లేవు





**పెరుగుదలకు ప్రోటీనులు**

మొదటి రెండేళ్ళలో, బిడ్డ తన బరువును నాలుగురెట్లు అధికం చేసుకొంటూ త్వరత్వరగా పెరగాలి ఈ పెరుగుదలలో ఎక్కువ భాగం ప్రోటీనులవల్లనే వస్తుంది. మీ బిడ్డ పుష్టిగా, బలంగా పెరుగుటకు కావలసినశరీర నిర్మాణక ప్రోటీనులన్ని అమూల్ స్ప్రేలో ఉన్నాయి.

**సులభంగా జీర్ణమవుతుంది**

అమూల్ స్ప్రే తయారు చేయబడిన స్ప్రే.డ్రయింగ్ పద్ధతి ద్వారా ప్రతి యొక్క పాలచుక్క అతి సూక్ష్మపుటణువుగా (తల్లిపాలవలెనే) మారుతుంది. ఇందువల్ల, అమూల్ స్ప్రే తేలికగా జీర్ణమవుతుంది. బిడ్డ కూడా దాని మధురమైన రుచిని యిష్టపడి...మొదటి నుండే దాని పుచ్చుకొంటాడు.





**విటమినులు, తదితర మంచి పదార్థముల చేరిక**

అమూల్ స్ప్రేలో మీ బిడ్డకు కావలసిన విటమినులన్ని ఉన్నాయి, పిండి పదార్థాలు, క్రొవ్వు పదార్థాలు ఇంకా భాస్వరము, ఇనుమువంటి ముఖ్య పోషక పదార్థాలు ఇందులో ఆదర్శప్రాయంగా సంతులితముగా నింపబడి యున్నాయి నైయసిన్, సోడియం ఐయోడైడ్, ఫోలిక్ ఏసిడ్ మొదలైన; వాని వాని సహజస్థితిలోనే ఉన్నాయి.

**ఆధునిక స్ప్రే-డ్రయింగ్ పద్ధతి**

అమూల్ స్ప్రే ఐరోపా, అమెరికాలలో ఉపయోగించే స్ప్రే-డ్రయింగ్ పద్ధతి ననుసరించి చేయబడుతుంది. ఈ మెఱుగు పద్ధతి వలన తక్కువ శీతోష్ణపరిమాణంలో పాలు పొడిగా మారుతుంది. అందుచేత, ప్రోటీను యొక్క నాణ్యత, సమృద్ధి ఎక్కువ భద్రపఱచబడి యుంటుంది.






అమూల్ స్ప్రే మీకు
500 గ్రాముల డబ్బలో
(1 పౌను మీద 46 గ్రాములు
ఎక్కువ) దొరుకుతుంది.

**సులభంగా కరుగుతుంది**

ముందు పేస్టుగా చేసుకోనక్కరలేదు. అమూల్ స్ప్రే సరియైన కొలతలో తీసుకొని కావలసినన్ని వేడినీళ్ళలో చేర్చి బాగా కలపండి. పాలపొడి వెంటనే కలిసిపోతుంది. పాలపీకను అడ్డుకోదు.

సోల్ డిస్ట్రిబ్యూటర్లు:
వోల్టాస్ లిమిటెడ్, తయారీ: కైరా డిస్ట్రిక్ట్ కో-అపరేటివ్ మిల్క్ ప్రొడ్యూసర్స్ యూనియన్ లిమిటెడ్, ఆనంద్

సంవత్సరాలైతే...అక్కయ్య ఏమయింది? అని కూడా ఆలోచించని నువ్వు ... ఇప్పుడు అక్కయ్యదగ్గరకి వొచ్చావు. నీకు డబ్బు కావాలి...అవునా?'

'అక్కయ్యా'

'సత్యం...ఎందుకురా ప్రతి చిన్న విషయానికి కళ్లల్లో నీళ్లు నింపుకుంటావు. వొద్దురా...నువ్వు కన్నీళ్లు పెడితే చూడలేను. ఏదో కోపం కొద్ది అన్నాను. తీసుకోరా...తీసుకోరా...'అంటూ గబగబా పెట్టెలోంచి రెండువందలరూపాయలు యిచ్చింది.

'అక్కయ్యా—'

'ఒరేయ్ సత్యం...త్వరగా వెళ్లరా...అమ్మ ఆరోగ్యం జాగ్రత్త.'

'అక్కయ్యా! యింతడబ్బు...మరినీకు....'

'నాకేం ఫరవాలేదురా ... నాకేం ఫరవాలేదురా...'

ఆమె అలా బయటకి అందిగాని, ...తమ్ముడితో చాలా చెప్పాలనుకుంది. 'ఒరేయ్ అప్పుడు ఏమయిందో తెలుసా? మామూలు సినిమాల్లోను, కథల్లోను జరిగినట్లు రామిరెడ్డి నన్ను మద్రాసులో వొంటరిగా విడిచి వెళ్లిపోయాడు. కొంతమంది తుంటరి వెధవలు నన్ను తినడానికి ప్రయత్నించారు. కాని భగవంతునిదయవల్ల 'మదర్' చేత రక్షించబడ్డాను. అంతా యాదృచ్ఛికం! ట్రైనింగ్ ప్యాస్ అయ్యాను. రంగనాథంగారి పుణ్యమానీ వారి రికమండేషన్‌వల్ల ఈ పంచాయితి సమితిలో ఉద్యోగం వచ్చింది. వచ్చిన తాత్కాలిక ఉద్యోగం ప్రతి నిమిషం ఎప్పుడు ఊడుతుందో తెలీకుండావుంది. ప్రస్తుతం నన్ను తొలగించారు. మళ్లీ చేర్చుకుంటారుట...ఒరేయ్ సత్యం నాకేం ఫరవాలేదు. ప్రతినెల నేనుకూడా కొంత డబ్బు పంపిస్తాను. అమ్మకి మాత్రం చెప్పకురా...బాధ పడుతుంది. నన్నిలాగే అజ్ఞాతంగా వుండిపోనీ! ఒరేయ్ మీరు నన్ను మర్చిపోవచ్చును ... మీకు అయిన వాళ్లు కావలసినవాళ్లు చాలా మంది వున్నారు. నా కెవరు వున్నారు. సదా మిమ్మల్ని గురించే ఆలోచిస్తోవుంటాను.

అక్కయ్య మాట్లాడకుండా మౌనంగా వుండటం గమనించి 'నేను వెళ్తాను అక్కయ్యా— వెళ్లగానే ఉత్తరం రాస్తాను.'

'సరే...ఒక విషయం గుర్తుంచుకో. నా విషయం అమ్మదగ్గర ప్రస్తావించకు.'

# సశేషం

సుమతి తలుపులు తెరిచింది.

* * *

మూసిఉన్న తలుపుల వొంక మగతగా చూశాడు సత్యమూర్తి. ఇప్పుడిప్పుడే అతనికి మత్తు దిగిపోతున్నది. 'నే నిప్పుడు ఎక్కడ వున్నాను. యిక్కడికి ఎలా వొచ్చాను.' అంటూ ప్రశ్నించుకున్నాడు సత్యమూర్తి. అవును. తాను రెండువందలు అక్కయ్య దగ్గర తీసుకొని బస్ ఎక్కాడు. తరువాత ఊళ్లోకి వొచ్చాడు, అన్ని షాపులు బంద్. ఉన్న రెండుమూడు షాపులలో తనకికావలసిన మందులు దొరకలేదు. అంతలో చిన్ననాటి స్నేహితుడు దాస్ కనబడ్డాడు.

'హల్లో సత్యమూర్తి. ఇక్కడున్నావేమిటి?'

'మా అమ్మకి మందుకావాలి—'

'మీ అమ్మకి సరే ... ముందు నువ్వు మందు పుచ్చుకోవాలి. ఏమిటలా ఉన్నావు... పాతికసంవత్సరాలు కూడా నిండలేదు... నాలుగుపదులు నిండినట్లున్నాయ్.'

'ఏం చెప్పను దోస్త్ ... మా అమ్మకి మందులు...ఉద్యోగంలో ప్రమోషన్ లేదు యింతవరకు.' అతని మాటలకు అడ్డు వస్తూ అన్నాడు దాసు 'ఇవి మామూలుగా ప్రతి కుటుంబంలో వుండేబాధలే ... వీటి కోసం బెంగపెట్టుకొని వెధవ మొహం వేసుకొని తిరగనక్కరలేదు.'

'అది కాదురా...నా బాధలు నీకు తెలీవు. ఒకొక్కప్పుడు చనిపోవాలనిపిస్తుంది. కాని ఆత్మహత్య చేసుకోలేకపోతున్నాను ... చావు రావటంలేదు. జీవచ్ఛవంగా జీవితాన్ని గడపలేకపోతున్నాను.'

'నీ బాధ నాకు అర్థం అయింది. నువ్వు మందు పుచ్చుకోవాలి. డబ్బు ఏ మాత్రం వుంది'

'రెండువందలు' సత్యమూర్తి మాటలు పూర్తికాలేదు. టాక్సీని పిలిచాడు దాసు.

* * *

'దాసూ' అని బిగ్గరగా అరవబోయాడు. కాని నోరు పెగలలేదు. కళ్లు మండి పోతున్నాయి. కాళ్లు తేలిపోతున్నాయి. అపరిమితమైన ఆకలి వేస్తున్నది. అప్రయత్నంగా జేబులు తడుముకున్నాడు. దూరంగా పోలీస్ విజిల్ వినబడింది. యింటిపరిస్థితి గుర్తుకి వచ్చింది. దూరంగా కుక్కేడుపు వినబడింది

సత్యమూర్తి ఒక్కసారిగా పరిగెత్తి పరిగెత్తి ఆగిపోయాడు. వొస్తున్న రైలు కూడా ఆగిపోయింది. రైల్లో జనం వెంబడిస్తున్నారు. సత్యమూర్తి పరిగెడుతున్నాడు.

'పట్టుకోండి...పట్టుకోండి. ఆత్మహత్యకి ప్రయత్నిస్తున్నాడు. జనం అందరికి దూరంగా బావిదగ్గరికి వొచ్చాడు. బావిలో దూకాలనుకున్నాడు. దూకినా చనిపోకపోతే.. ఎవరైనా రక్షిస్తే...అమ్మ బాబోయ్.. బావిలో పడలేక పట్నంలోకి వొచ్చాడు.

'ఎండ్రిన్ కావాలండి—'

'ఎందుకండి--' సీడ్ స్టోర్సు గుమాస్తా ప్రశ్న.

'ఎందుకేమిటి చావడానికి—'

'ఇది చనిపోయే మొక్కల్ని బ్రతికిస్తుంది. బ్రతికున్న మనష్యుల్ని చంపదు.' కళ్లు పైకెత్తి చూశాడు గుమాస్తా.

అందరికి కనుచూపు అందనంత దూరం పోయి ఆగాడు సత్యమూర్తి. తాను చనిపోలేదు. జీవించలేదు. కారణం తాను అసమర్థుడు, అసమర్థుడు— తన అసమర్థతే తన జీవితాన్ని మార్చివేసింది ఆ రోజు శ్యామల నోరు తెరచి అడిగితే నిరాకరించాడు. స్త్రీ, పురుష స్నేహానికి ఈ సంఘం వేస్తున్న ముద్ర చూస్తున్నాడు. తానింటికి ఏ మొహం పెట్టుకుని వెళ్తాడు. మూడుసంవత్సరాలయింది శ్యామల్ని చూసి. ఎలావుందో. అయినా తనెందుకు చూడాలి. ఏం సంబంధం! శ్యామల—శ్యామల— అతని ఆలోచనలు వెనక్కి వెళ్లాయి.

* * *

సత్యమూర్తి, శ్యామల ఇరుగుపొరుగు యింటి పిల్లలు. శ్యామల నాన్న గుమస్తాగా ప్రవేశించి గజిటెడ్ ఆఫీసర్‌గా రిటైర్డు అయి బాగా సంపాదించాడు. సత్యమూర్తి తండ్రి సెకండరీగ్రేడు టీచర్‌గా ప్రవేశించి బి. యి. డి గా మారి హెడ్‌మాస్టరు కాకుండానే మూడువేలు అప్పుచేసి ఆరువేల యిల్లును కుటుంబానికి వదిలి కన్నుమూశాడు.

శ్యామల తండ్రి రంగనాథంగారు కులం తక్కువ పిల్లను పెండ్లి చేసుకున్నారనే నిందతో దాయాదులు ఎవరూ ఆయనదగ్గర చేరలేదు. డబ్బు వచ్చిన తరువాత, నలుగురైదుగురు దాయాదులు దగ్గరకి వొచ్చినా త్రిప్పికొట్టాడు రంగనాథంగారు.

సత్యమూర్తి, శ్యామల కలిసి పెరిగారు. చిన్నతనంలో తల్లిని కోల్పోయిన శ్యామల్ని చాలా ఆదరంగా చూస్తూ వుండేది జానకమ్మగారు. ఎక్కువ కాలం జానకమ్మగారు యింట్లోనే కాలం గడిపేది శ్యామల. రంగనాథంగారు అంతగా కూతురు విషయం పట్టించుకునేవారు కాదు. సత్యమూర్తి, శ్యామల కలిసి తిరిగేవారు, ఆడేవారు. సత్యమూర్తికి ఒకే నేస్తం శ్యామల. శ్యామలకి కొంచం నలతగా వుంటే బాధపడేవాడు సత్యమూర్తి. చదువులో సత్యమూర్తి కన్నా రెండు క్లాసులు చిన్న అయినా మనసులో రెండు క్లాసులు మిన్న. హైస్కూల్లో చదువుతున్న రోజులలో ఒకరోజు సన్నగా వెన్నెల సన్నజాజి పందిరక్రింద కురుస్తున్నది. 'నీకు లేత ఆకు రంగుపూల పరికిణి బాగుంది.' అన్నాడు సత్యమూర్తి. 'నేను ఎలాగు వున్నాను?' అంది గర్వంగా శ్యామల. 'దేవతలా వున్నావు' అన్నాడు. 'అయితే భక్తుడు నన్ను ఆరాధించడేమిటి?' అంది నవ్వుతూ. 'కోరిన వరాలు యిస్తారా మరి దేవిగారు.'

'భక్తుడి అదృష్టం' యిద్దరు కలిసి నవ్వుకునేవారు. తరువాత వారి యిద్దరి మధ్యన అనేక రకాల సంభాషణలు జరిగేవి గాని ప్రేమ, పెండ్లి విషయాలు గురించి ప్రసక్తి వచ్చేదికాదు. బి. ఏ సెకండ్ ఇయర్ చదువుతున్నాడు సత్యమూర్తి. అప్పుడు పి. యు. సి చదివేది శ్యామల. ఆ రోజులలో ఒకసారి వాళ్లిద్దరి మధ్య పెండ్లి సంభాషణ రావడానికి అవకాశం ఏర్పడింది. ఆ రోజున సత్యమూర్తి పెద్ద అక్కయ్య పెండ్లి. ఎవరో శ్యామల్ని అడుగుతున్నారు. 'నువ్వు ఎవరిని పెండ్లి చేసుకుంటావ్' అని. శ్యామల మేడమీదికి పరిగెత్తింది. సత్యమూర్తి ఆమెను వెంబడించి ప్రశ్నను రెట్టించాడు. 'నిన్ను' అంది కళ్లు మూసుకొని. 'వొద్దు శ్యామలా వద్దు నువ్వు అలా అనవద్దు ... నీవు చాలా తెలివైనదానవు...అందమైనదానివి...నీకు మంచి భవిష్యత్ వుంది. నావంటి అభాగ్యునితో—' సత్యమూర్తి నోటిని మూస్తూ అంది శ్యామల.

'ఏమిటా మాటలు ... నాకు కోపం వస్తుంది.'

'నిజం శ్యామలా...నువ్వు నన్ను శాసించు. దేవతలా పూజిస్తాను. స్నేహితురాలిగా మిగిలిపో. నన్ను మాత్రం పెళ్లి చేసుకోవద్దు.'

*   *   *

అతని ఆలోచనకుల భంగం కలిగిస్తూ కారు వచ్చి సడెన్ బ్రేక్‌తో ఆగింది. ఉలిక్కిపడ్డాడు. ఫుట్‌పాత్ ఎక్కాడు.

'సత్యం' మృదుమధురంగా వినబడింది.

కారు వంక చూశాడు. 'సత్యమూర్తి' అంటూ తిరిగి పిలిచింది. సత్యమూర్తి తప్పించుకోలేకపోయాడు. రోడ్డుమీద రభస అవడం యిష్టంలేదు, కారు డోర్ దగ్గరికి వొచ్చాడు.

'సత్యమూర్తి...సత్యమూర్తి...ఏమండి... సత్యమూర్తి...వీరు రామచంద్రరావుగారు... ఇంజనీర్, సౌత్ ఇండియాలో —ఖిలాయ్ నీకు తెలుసుగా...ఏమండి...ఈయన సువర్చలా... సత్యమూర్తి.' ఆమెకు మాటలు పెగలటం లేదు. రామచంద్రరావు శ్యామల బుజం తడుతూ 'మీరీ రోజు చాలా బలహీనంగా వున్నారు. ఎక్కువగా మాట్లాడకండి. సత్యమూర్తిగారు...లోపలకి రండి' అన్నాడు తన మామూలు ధోరణిలో.

'ఆయన రాలేరులెండి...మందులు కోసం తిరుగుతున్నారు...నిన్న సాయంకాలంనుండి... ఇప్పుడు 7-30 నిమిషాలయింది...వెళ్లు సత్యమూర్తి వెళ్ళు... రామచంద్రరావుగారికి పరిచయం చేయాలని పిలిచాను ... మీ అమ్మకి ఆరోగ్యం బాగుండలేదు...అన్నట్లు మరిచాను...సువర్చలకీ పుస్తకం యివ్వు... అడిగింది.'


మాటలు తృంచి తృంచి ఉపయోగించింది సత్యమూర్తి దగ్గరనుండి ఎటువంటి సమాధానం ఆశించకుండానే 'డ్రైవర్ కారు పోనియ్...ఇప్పటికి అలిసిపోయాను...' అంది శ్యామల, కారు కదిలింది. యాంత్రికంగా నెమ్మదిగా కదిలాడు. శ్యామల వాలకం ధోరణి చూస్తూ వుంటే ఏదో కీడు శంకిస్తున్నాడు. పత్రిక విప్పాడు. లోపల అన్నీ పదిరూపాయలనోట్లు. అనాలోచితంగా చదివాడు 'సృష్టిలో తియ్యనిది!—' 'శ్యామలా.. శ్యామలా...ఎందుకిలా వచ్చావు.. ఎందుకిలా వెళ్లిపోయావు...' అతని ఆలోచనలు మారాయి. దూరంగా బిచ్చగత్తె అరుస్తున్నది. 'తల్లిదండ్రిలేని పిల్లలండి.. కనికరించండి' గాఢంగా నిట్టూర్చి ముందుకు సాగాడు. రెప్పపాటులో కారుప్రమాదం తప్పిపోయింది. 'హేభగవాన్ రక్షించు.. నన్ను చంపకు...నా మీద ఆధారపడివున్న వాళ్లను నిరాశ్రయులను చేయకు—' నెమ్మదిగా రోడ్డు క్రాస్‌చేశాడు. అతను నడుస్తున్నాడు. కాని అతని మనసులో శ్యామల మెదలుతోంది. శ్యామల ఒకవేళ తనింటికి వెళ్లిందేమో...అక్కడ ఏమైనా...

*   *   *

శ్యామల వరండాలోకి వచ్చి అడిగింది.

'సత్యమూర్తిగారు ఉన్నారాండీ—'

గుమ్మం దగ్గర నించున్న సువర్చల మాట్లాడలేదు.



'సత్యమూర్తి లేడాండి—'

'లేరు–'

'సత్యం తమ్ముళ్లు చెల్లెళ్లు...అమ్మా... అక్కయ్యలు—అన్నయ్య—'

శ్యామల మాటలకి అడ్డువస్తూ చురుగ్గా అంది సువర్చల.

'అందరు నిద్రపోతున్నారు. వాళ్లను యిప్పుడు నిద్ర లేపడం అంత ఆరోగ్యకరమైన విషయంకాదు. మీ పేరు శ్యామలా —'

'అయితే మీ పేరు సువర్చల—అంతేనా–' అంటూ నవ్వింది.

'ఇంతకి సత్యమూర్తి ఎక్కడకు వెళ్లారో చెప్పారుకాదు–'

'మీ యింటికి వొచ్చిఉంటారని ఊహించాను–'

'నేను అలాగే బస్‌లో ఊహించాను. యింటికి వచ్చి మా నాన్నను అడిగాను సత్యమూర్తి వొచ్చాడా అని—ఆయన రాలేదని చెప్పాడు. నాకు భలే ఆశ్చర్యం వేసింది. సత్యమూర్తిని చూసి మూడు సంవత్సరాలు అయింది?' అంటూ విచిత్రంగా కళ్లు త్రిప్పింది.

'చూడండి శ్యామలాదేవిగారు సత్యమూర్తి యిప్పుడు ముగ్గురు బిడ్డల తండ్రి... ఇప్పుడు సౌందర్య ఆరాధన! దేవతా—' ఆమె మాటలకి అడ్డువస్తూ చురుగ్గా అంది శ్యామల. 'ఏమిటి మీ ఉద్దేశ్యం—'

'దయ వుంచి బిగ్గరగా మాట్లాడకండి. మావారు మీరు స్నేహితులు కావచ్చును. ప్రేమించుకోవచ్చును. ప్రస్తుతం ఆయనకో భార్య వుంది. ముగ్గురు పిల్లలు వున్నారు. పెద్ద సంసారభారం వుంది. ఒక అవివాహిత స్నేహితురాలివల్ల సత్యమూర్తిగారి కుటుంబం నాశనం అయిందనే నింద–'

'మీరు మాట్లాడే ధోరణి అర్థంకావడం లేదు.'

'నేను అంతా చెప్తాను వినండి...మా వారు మిమ్మల్ని వివాహంచేసుకోలేకపోయారు. బి ఏ. మూడో సంవత్సరం చదువుతున్నప్పుడు వాళ్ల నాన్నగారు పోయారు. అప్పుడు మీరు వొచ్చారనుకుంటాను. తరువాత అప్పులవాళ్ల బాధ పడలేక నన్ను పెండ్లి చేసుకున్నారు. కాని ఎప్పుడూ ఏదో పోగొట్టుకున్నవాళ్లల్లా ఆలోచిస్తూ వుంటూ వుంటారు–' సువర్చల వజలవయనాలతో

# సశేషం

ఒక్కక్షణం ఆగి అంది.

'మీకు మావారికి ఉత్తరాలు సాగుతున్నాయి. అందరికి తెలిసిందే. దాంట్లో కుటుంబ విషయాలు మినహాయించి ఏవి వుండటంలేదు. స్త్రీ కుండే సహజమైన అసూయతో చెబుతున్నాను వినండి. ప్రతీ చిన్న విషయానికి మీ సలహా అడగడం నాకు యిష్టంలేదు—పైగా. మీరూ; మావారు యుక్తవయసులో వున్నారు—ఎప్పుడైనా—' తలవంచేసింది సువర్చల.

ఆ తీవ్రశరాఘాతాన్ని తట్టుకోలేకపోయింది శ్యామల.

మౌనంగా మునిపంటితో పెదవుల్ని కొరుక్కుంది.

'ఏమి అనుకోకండి...మానవుడు ప్రకృతికి బానిస...క్షమించండి నా దొక ప్రార్థన. దయచేసి మీరు త్వరలో వివాహం చేసుకోండి...దానివల్ల ఆయనకి కొంచం మనశాంతి కలుగుతుంది. తాను వివాహం చేసుకోకపోవడంవల్ల శ్యామల వివాహంపట్ల విముఖతను వ్యక్తపరుస్తోంది, అని అనుకుంటున్నారు—'

'సువర్చలాదేవిగారు మీ మనసులో బాధ అంతా చెప్పేశారు. కాని సత్యమూర్తి అలా కాదు.. తన మనసులోని బాధను ఎవరికీ త్వరగా చెప్పడు. అది ఏ కొద్ది మందికో చెప్తాడు...సరే...మీకో శుభవార్త. నేను పెండ్లి చేసుకోబోయేవరుడు రేపు ఉదయం వొస్తారు. యిద్దరం కలిసి వస్తాము...అమ్మగారికి ఎలా వుంది—'

'డాక్టర్ ఇంజక్షన్ యిచ్చింది...ఇప్పుడే పడుకున్నారు—'

'మీరు మాత్రం అవివాహితగా సత్యమూర్తికి కనబడకండి—' అంది సువర్చల. 'నేను కనబడను...కనబడను...' అంటూ వెళ్లిపోయింది శ్యామల.

* * *

మేడమీద పిట్టగోడదగ్గర నించున్న శ్యామల దగ్గరికి వెళ్లి భుజంమీద చేయివేసి రంగనాధంగారు అన్నారు.

'రామచంద్రరావు వెళ్లిపోయాడు—'

'నాకు తెలుసునాన్నా—' అందామె నిర్లిప్తంగా.

'పారిస్ వెళ్లి వచ్చాడు...చదువు సంస్కారం వుంది అనుకున్నాను! ప్రొద్దున్న స్టేషన్‌లో ఏమైనా జరిగిందా అమ్మా–'

'లేదు నాన్నా...ఆయన్ని డ్రైవరో చూపించాడు. నేను నమస్కారం పెట్టి... 'మా నాన్నగారు పూజలో వున్నారు—రిసీవ్ చేసుకోడానికి రాలేకపోయారు.' అన్నాను. 'ఫరవాలేదు లెండి' అన్నారు. తరువాత కాలేజి కబుర్లు ... అవీ చెప్పుకున్నాము. అంతలో సత్యమూర్తి కనబడ్డాడు. పిలవకూడదు అనుకున్నాను...నిన్న సాయంకాలం యింటిదగ్గరనుండి బయలుదేరాడట:— 'సంగతి ఏమిటో తెలుసుకోవాలనుకున్నాను. తెలుసుకోలేకపోయాను.'

'తరువాత నాకు తెలుసమ్మా...ముందు నన్ను ఏమిఅడిగాడో తెలుసా సత్యమూర్తికి మీ అమ్మాయికి గల సంబంధం ఏమిటి? ఎంతకాలంనుండి మీ అమ్మాయి సత్యమూర్తికి డబ్బు యిస్తున్నది...'అవి ఏవో అడిగాడు...అప్పుడు నాకు వొళ్లుమండి. ఆయన మాటలకి అడ్డు వస్తూ అంది 'ఇవన్నీ ఇప్పుడెందుకు నాన్నా...జానకమ్మగారికి ఎలా వుందో—డాక్టర్ కృష్ణవేణికి ఫోన్ చేశాను...వాళ్లింటికి వెళ్లి ట్రీట్‌మెంట్‌చేసి ఫోన్ చేయమన్నాను'

'పిచ్చితల్లి...' అంటూ ఆమె తలనిమిరారు రంగనాధంగారు. అంతలో ఫోన్ మ్రోగింది.

రిసీవర్ అందుకుంది శ్యామల. ఆమె మొహం వెలవెలపోయింది.

'నాన్నా...నాన్నా...' అందామె బిగ్గరగా.

'షి వజ్ డెడ్... రాత్రే ఆమె ప్రాణం పోయిందట.'

'పోదాం పదమ్మా...' అన్నారు రంగనాధంగారు.

'నేను రాను. నువ్వు వెళ్ళు నాన్నా.'

'అదేమిటమ్మా'

'అవును నాన్నా...నాకు ఢిల్లీలో ఉద్యోగం వచ్చింది వెళ్ళాలి.'

'తండ్రిదగ్గర ఎందుకమ్మా అబద్దాలు. నువ్విప్పుడు రాక తప్పదు సత్యమూర్తి నువ్వు లేకపోతే—'

'నాన్నా—' అందామె బిగ్గరగా అవాలోచితంగా. ●